ఆదరణ కరువై.. బతుకు బరువై..

- కళ్లుప్పుపై ఆసక్తి చూపని నగర ప్రజలు
- అమ్మకాలు సాగక కూలీలుగా మారుతున్న ఉప్పు బండి వ్యాపారులు
- డిమాండ్ లేక నష్టాల్లో కూరుకుపోతున్న హోల్‌సేల్ కేంద్రాలు

నగరం అభివృద్ధి చెందుతోంది. ఆన్‌లైన్ వ్యాపారాలు.. షాపింగ్ మాల్స్ వచ్చేసాయి. దీంతో కళ్లుప్పు విక్రయించే వారి ఉపాధికి గండి పడింది. వేకువ జామునే వినిపించే 'అమ్మా.. కళ్లుప్పు..కళ్లుప్పు..'అనే అరుపులు నేడు మూగబోయాయి. దశాబ్దం.. దశాబ్దం న్నర కిందటి నుంచి ఈ వ్యాపారం సన్నగిల్లడంతో దీన్నే నమ్ముకుని బతుకు (ఉప్పు) బండి ఈడుస్తున్న వారి జీవనాధారం దెబ్బతింటోంది.


వ్యాపారాలు లేక మూలకు చేరుతున్న ఉప్పుబళ్లు

దాబాగార్డెన్స్: గతంలో నగరమంతా 300 కుటుంబాలు కళ్లుప్పు ఆధారంగా నడిచేవి. ఆన్‌లైన్ మార్కెట్ విస్తరిస్తుండడంతో ఆ సంఖ్య సింగిల్ డిజిట్‌కు చేరింది. ఇదిలా ఉండగా.. రోజుకి టన్నుల కొద్దీ ఉప్పును విక్రయించే ఉప్పు కేంద్రాలు ప్రస్తుతం కేజీల్లో అమ్ముతున్నాయి. వ్యాపారాల్లేక కళ్లుప్పు విక్రయించే వారు కూలి పనులకు వెళ్లిపోతున్నారు. వీరు నగరంలోని అఫీషియల్ కాలనీలు.. మురికివాడ ప్రాంతాలు.. ప్రధాన జంక్షన్లలో తిరుగుతూ ఉప్పు విక్రయించేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. 20 నుంచి 30 ఉప్పు బళ్లు మాత్రమే కొన్ని చోట్ల తిరుగుతున్నాయి. వీరంతా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని గల్లీల్లో తిరిగి ఉప్పు విక్రయిస్తున్నా ఆశించినంతా వ్యాపారం జరగకపోవడంతో అర్ధాకలితోనే జీవిస్తున్నారు.


వీధి..వీధి తిరిగి కళ్లుప్ప విక్రయిస్తున్న చిరు వ్యాపారి


ఉప్పబండిలో కళ్లుప్ప

ఈ వ్యాపారాన్నే నమ్ముకున్నా..



1981 నుంచి కళ్లుప్పు వ్యాపారం చేస్తున్నాను. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు వీధి వీధి..గల్లీ గల్లీ ఉప్పుబండి లాగుతున్నా. పదేళ్ల కిందటి వరకు వ్యాపారం బాగానే ఉండేది. పిల్లకు పెళ్లి చేసాను. ఆన్‌లైన్ మార్కెట్ వచ్చేయడంతో వ్యాపారం సన్నగిల్లింది. నాతోటి వారు చాలా మంది కూలి పనులకు వెళ్లిపోయారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో కల్లుప్పునే నమ్ముకుని బతుకు (ఉప్పు) బండి ఈడుస్తున్నా. ప్రభుత్వం మాలాంటి వారిని గుర్తించి ఆధారం చూపాలి.

– ఎస్.చిన్నారావు, ఉప్పు విక్రయదారుడు

45 ఏళ్ల నుంచి..



మా తండ్రి డి.చంద్రరావు 45 ఏళ్ల కిందట నీలమ్మ వేపచెట్టు వద్ద శ్రీతారకరామా సాల్ట్ మర్చంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో సుమారు 200 నుంచి 250 ఉప్పుబళ్లకు ఉప్పు విక్రయించే వాళ్లం. ఆన్‌లైన్ మార్కెట్ వచ్చేయడంతో ప్రస్తుతం ఐదారు బండ్లకే ఉప్పు విక్రయిస్తూ బతుకుబండి లాగుతున్నా. కల్లుప్పు కనుమరుగవుతోంది. గతంలో పూడిమడక, అచ్యుతాపురం, చీపురుపల్లి తదితర ప్రాంతాల ఉప్పు బట్టీల నుంచి ఉప్పు రప్పించుకునే వాళ్లం. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా సెజ్‌లు.. కంపెనీలు వచ్చేయడంతో నెల్లూరు, తమిళనాడు, ఇసుకపల్లి నుంచి ఉప్పు రప్పిస్తున్నాం. అప్పట్లో కేజీ ఉప్పు పై.5 నుంచి పై.10గా ఉండేది. ప్రస్తుతం కేజీ ఉప్పు రూ.10 అయినా ఫలితం ఉండడం లేదు. ఈ ఉప్పునే నమ్ముకుని చాలా మంది విక్రయదారులు ఉన్నారు. వారంతా ఉపాధి కోల్పోయారు. ప్యాకెట్లు వచ్చేయడంతో లూజ్ విక్రయాలపై ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

– డి.రమణ, కళ్లుప్పు విక్రయదారుడు

క్లుప్తంగా

అంధకారంలో వెంకటేశ్వరమెట్ట

అల్లిపురం: వారం రోజులుగా వెంకటేశ్వరమెట్ట అంధకారంలో ఉంది. ఇక్కడి ఎస్ఎస్ నంబరు 11 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో అన్ని విద్యుత్ స్తంభాలపై గల వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు తెలిపారు. చీకటి పడితే పిల్లల్ని వీధుల్లోకి పంపాలంటే భయంగా ఉందని, కుక్కలు అధిక సంఖ్యలో తిరుగుతూ భయపెడుతున్నాయని తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దడిని వారాహి అవతారంలో అమ్మవారు


దడిని వారాహి అవతారంలో వారాహిదేవి

అల్లిపురం: బంగారుమెట్ట షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రుల సందర్భంగా మంగళవారం ఆషాఢ శుద్ధ నవమి సందర్భంగా అమ్మవారు దడిని వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని పసుపుతో విశేషంగా అలంకరించి పూజించారు. అమ్మవారికి చక్కెర పొంగలి ప్రసాదం నివేదన చేసి, మధుర (తేనె) దీపంతో పూజించారు.

నేడు ఆది వారాహి అవతారంలో..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారు బుధవారం ఆది (దుర్గా) వారాహి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహా నైవేద్యం నివేదించనున్నారు.

అనధికార కట్టడాల తొలగింపు

జగదాంబ: అనుమతులు లేని కట్టడాలను కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు తొలగిస్తున్నామని జోన్–4 టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జోన్–4 పరిధిలో అనధికార కట్టడాలను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జోన్‌లోని 12 వార్డుల్లో అనధికార కట్టడాలను గుర్తించి, వాటి యజమానులకు ముందుగా నోటీసులు అందజేశామన్నారు. వాటిని వారే తొలగించాలని తెలియజేశామన్నారు. అయినప్పటికీ స్పందించని భవన యాజమానుల కట్టడాలను తమ సిబ్బందితో తొలగించడం మొదలుపెట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే 35వ వార్డు వెలంపేట వద్ద కట్టడం తొలగించామన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో మాట్లాడుతున్న రంథి గోపికృష్ణ

అల్లిపురం: ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంథి గోపికృష్ణ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్లో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యా కానుక ద్వారా విద్యార్థులకు యూనిఫారాలు, షూస్, పుస్తకాలు ఇప్పటికే అందించినట్లు తెలిపారు. త్వరలోనే అర్హులకు అమ్మఒడి కూడా అందజేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు వై.చిన్నమ్మలు, భీశెట్టి రాజు, ఆదారి వెంకట మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదే విధంగా అల్లిపురం మోడల్ స్కూల్లో పాఠశాల ఉపాధ్యాయురాలు కనకమహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంథి గోపికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ

వృద్ధాశ్రమానికి వాసవీ క్లబ్ వితరణ


ప్రియదర్శిని వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు

అల్లిపురం: వాసవీ క్లబ్ అల్లిపురం శాఖ సభ్యులు తమ దాతృత్వం చాటుకున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ప్రియదర్శిని వృద్ధాశ్రమానికి సుమారు రూ.35 వేలు విలువ గల నెల రోజులకు సరిపడ నిత్యావసర వస్తువులు క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, క్లబ్ ప్రతినిధులు ఎం.చంద్రశేఖర్, కేవీ సత్యనారాయణ, సీహెచ్ ప్రసాద్, ఎ.శ్రీధర్, ఎస్.వి. గిరీష్‌కుమార్, బీవీ కృతిక భాను తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం ప్రతినిధులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలు ఉపయోగిస్తే చిత్తే..


వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో ప్రొఫెసర్లు

దాబాగార్డెన్స్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వినియోగించడం ద్వారా మనిషి జీవితం చిత్తు కావడంతో పాటు చట్టపరంగా కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు తెలిపారు. డ్రగ్ ఎబ్యూజ్ అండ్ హ్యూమన్ ట్రాఫికింగ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నగరంలోని ఏవీఎన్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేకేఎల్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె. కిరణ్, డాక్టర్ ఎర్రయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ నేటి తరం యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల ఆరోగ్యపరంగా నష్టపోవడంతో పాటు చట్టపర చర్యలకు బాధ్యులవుతారన్నారు. మానవ అక్రమ రవాణా కూడా ప్రస్తుత రోజుల్లో పెరిగిపోతూ సమాజానికి తీవ్రమైన నష్టం కలుగుతుందని, వీటి బారిన పడకుండా యువతరం అప్రమత్తంగా ఉండాలని, మహిళల రక్షణకు జాగ్రత్త వహించాలన్నారు. ఏ ప్రాంతంలో ఏ చిన్న సంఘటన జరిగినా పోలీస్ అధికారులకు సమాచారం అందించి, వారిని కాపాడాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో తమ వాణి వినిపించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాన్వెంట్ జంక్షన్ పెట్రోల్ బంక్ బహిరంగ వేలం 14న

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–5 (జ్ఞానాపురం) పరిధిలో గల కాన్వెంట్ జంక్షన్ పెట్రోల్ బంక్ (పాత ఐవోసీఎల్ బంకు)ను జూలై 14న జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంలో స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ప్రకారం పాట ఖరారు కాబడిన తర్వాత పాట మొత్తంలో నాల్గో వంతు సొమ్ము జీఎస్టీతో కలిపి ధరావత్తు పోగా మిగిలిన సొమ్ము జీఎస్టీతో కలిపి డీడీ ద్వారా/బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయ పర్యవేక్షణ పని దినాల్లో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ జాతర


అమ్మవారి తిరువీధి ఉత్సవంలో తోడపెద్దు సేవ

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం అల్లిపురం రాచపోలమాంబ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కుమ్మరవీధిలో గల అమ్మవారి పెద్దింటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, గరిడి, సాంప్రదాయ డప్పు వాయిద్యాల మధ్య కుమ్మరవీధి పెద్దింటి నుంచి అమ్మవారి సతకం పట్టు, సింహాలదేవిడి, అక్కడి నుంచి ఎరుకలవీధిలో గల పరదేశమ్మ అమ్మవారి దేవాలయం వరకు తిరువీధి నిర్వహించారు. అనంతరం అక్కడ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

1న 'నాన్న నీ మనసే వెన్న' కార్యక్రమం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: వాత్సల్య బాంధవ్యంగా నాన్న నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. తన్మయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న 'నాన్న నీ మనసే వెన్న' కార్యక్రమం పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఫాదర్స్‌డేను పురస్కరించుకుని 143 మంది అతిథులు నాన్న గురించి మాట్లాడేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదు చేస్తారని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బి.ఎస్. చంద్రశేఖర్, కార్యదర్శి సి.హెచ్.వి.సత్యనారాయణ, కార్యక్రమ సమన్వయకర్తలు బాదంగీర్ సాయి, ఎస్.నాగేశ్వరరావు, సభ్యులు ఎం.వి.రాజశేఖర్, కె.రాజు, ఎం.హరిమోహన్, జి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెలలో అమృతమయి అమ్మ పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది.

ప్రధాని మోదీ సందేశం వీక్షించిన బీజేపీ నాయకులు


ప్రధాని మోదీ సందేశాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట : మంగళవారం ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో బీజేపీ నాయకులు టీవీ ద్వారా ప్రధాని మోదీ సందేశాన్ని వీక్షించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, మైనార్టీ మోర్చా సభ్యుడు సీహెచ్ రాజబాబు, మహారాణిపేట మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లి శ్రీనివాసులనాయుడు, దాసరి శివ, శంకరరావు, వీసా వెంకటరమణ, జి.సునిల్‌కుమార్, కాకర రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


లక్ష్మీటాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించిన ఆయన ప్రజల నుండి అర్జీలు స్వీరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. వార్డులో ఓ మహిళకు రూ. 5,000 ఆర్థిక సాయం చేశారు. అలాగే ఆమె కుమారుడికి రూ.12 వేల జీతానికి ఉద్యోగం కల్పించారు. విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. జీవీఎంసీ 35వ వార్డులో పోలీస్ ఫుట్‌బాల్ టోర్నీకి అవకాశం కల్పించాలని, పూర్ణామార్కెట్‌లో 120 మైక్రాన్, 75 మైక్రాన్ ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం చేసుకునే విధంగా అవకాశం ఇవ్వాలని కోరుతూ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కనకమహాలక్ష్మి ఆలయ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేషన్ల డైరెక్టర్లు, 30, 36 వార్డుల అధ్యక్షులు మాసిపోగు రాజు, దశమంతుల మణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోనిదేవా, బాజ్జీ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా డాక్టర్ అచ్యుతరావు



మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా కేజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.అచ్యుతరావు తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ అచ్యుతరావు వైద్య సేవల్లో మూడు జిల్లాల్లో పేరు పొందారు. గతంలో ఒకసారి ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు, వైద్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాధ్యతాయుతమైన కౌన్సిల్ సభ్యునిగా తనను నియమించడం పట్ల డాక్టర్ అచ్యుతరావు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డి, ఇతర అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగన్నాథునికి పట్టు వస్త్రాల సమర్పణ


జగన్నాథ స్వామికి పట్టువస్త్రాలు అందజేస్తున్న రామతీర్థం ఆలయ ఈవో కిశోర్‌కుమార్

దాబాగార్డెన్స్: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీలో వేంచేసిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథునికి మంగళవారం విజయనగరం జిల్లా శ్రీరామచంద్రస్వామి ఆలయం (రామతీర్థం) తరపున ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్, స్థానాచార్యుడు నరసింహాచార్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, జగన్నాథస్వామి ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డికి పట్టువస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ : జూలై ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురించి వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కోరారు. మంగళవారం వార్డులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఏవైనా ఇబ్బందులుంటే జగనన్న సురక్ష శిబిరం దగ్గర పరిష్కరించుకునేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. అర్హులై ఉండీ ప్రభుత్వ పథకాలు అందని వారు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జనసేన అధినేత గురించి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కి రాజకీయ అనుభవం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి పవన్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో 35వ వార్డు వైఎస్ఆర్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీ శంకర్, శ్రీ దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్త బి. మంగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ మాజీ సీఎంవోహెచ్‌కు సత్కారం


కేఎస్ఎల్‌జీ శాస్త్రిని సత్కరిస్తున్న మేయర్, పలువురు అధికారులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ మాజీ ప్రధాన వైద్యాధికారి (సీఎంవోహెచ్) డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రిని మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పలువురు జీవీఎంసీ అధికారులు ఘనంగా సత్కరించారు. ఇటీవలే ఆయన బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ నరేష్‌కుమార్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి విధుల నిర్వహణలో భాగంగా జీవీఎంసీకి అందించిన సేవలను మేయర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవం


ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న తల్లిదండ్రులు

మురళీనగర్: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ విప్లవాన్ని సృష్టించి చరిత్రలో నిలిచారని మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.బ్రహ్మాజీ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలలో పేరెంట్ టీచర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తామన్నారు. అతి పెద్ద కార్పొరేట్ పాఠశాలలకు కూడా ఇటువంటి సదుపాయాలు లేవని చెప్పారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రభుత్వ పాఠశాలల దశను మార్చాయన్నారు. మనబడి నాడు–నాడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, జగనన్న ఆణిముత్యాలు, విద్యార్థుల ఆంగ్ల ప్రావీణ్య సాధనలో భాగంగా టోఫెల్ ప్రైమరీ, జూనియర్ శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తల్లితండ్రులు వినిపించారు.

కమనీయంగా కనకదుర్గమ్మ పండగ


కార్పొరేటర్ గోవింద్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

సీతంపేట: జీవీఎంసీ 25వవార్డు బీటీఆర్ కాలనీలో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారి వార్షికోత్సవం, అమ్మవారి ప్రధాన పండగ మంగళవారం వైభవంగా జరిగింది. సమీప ప్రాంతాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గోవింద్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారి ఘటాలు ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.